పంటలపై ఆగని గజ దాడులు

ప్రజాశక్తి - రొంపిచర్ల : పులిచెర్ల మండలంలో వ్యవసాయ పంటలపై వరుసగా ఏనుగుల గుంపు దాడులు చేస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో పులిచెర్ల మండలంలోని పాళెం, చల్లవారిపల్లె పంచాయతీలలో సోమవారం తెల్లవారు జామున వరి, టమాటా పంటలు, మామిడి, అరటి తోటలపై ఏనుగుల గుంపు దాడి చేయడం వల్ల రైతులకు తీవ్రనష్టం జరిగింది. నష్టపోయిన రైతులు దామోదర్ నాయుడు, నరేష్, సుబ్రహ్మణ్యం ఏనుగులు తొక్కిన పంటలు చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ శాఖ అధికారులు ప్రభుత్వం ద్వారా తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

పరిష్కారం ఎన్నటికో..

- రెవెన్యూ సమస్యలే అధికం
- పరిష్కారంలో అలసత్వం
- పిజిఆర్ఎస్‌లో 348 ఫిర్యాదుల్లో 261 రెవెన్యూ సమస్యలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

స్పందన, ప్రజాసమస్యల పరిష్కర వేదిక పేర్లు మారుతున్నా... ప్రజాసమస్యలు మాత్రం పరిష్కారిని నోచుకోవడం లేదు. జిల్లా కేంద్రం, రెవెన్యూ డివిజన్లు, మండలాలు ఎక్కడ ప్రజా ఫిర్యాదులపై వేదికలు నిర్వహించినా.. వందల సంఖ్యల్లో భూ వివాద సమస్యలే.. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు మొత్తం 348 ఫిర్యాదులు రాగా ఇందులో 261 రెవెన్యూ సమస్యలే ఉన్నాయంటే జిల్లా రెవెన్యూ సమస్యలు ఏమేరకు పేరుకుపోయాయో ఇటే అర్థమవుతోంది..

అధికార పార్టీకి చెందిన సారాంశ కార్యకర్తలు, పార్టీ సభ్యత్వ కార్డులతో జిల్లా కలెక్టరకు పెట్రోల్ క్యానతో ఆత్మహత్య చేసుకుంటామంటూ వచ్చారు. పంజాణి మండలం పుట్టగానుపల్లి దళితవాడ వాసులు అక్కడి అగ్రకులస్తులు తమ భూములను లాక్కోవడంతో పాటు అక్రమకేసులు పెడుతూ వేధిస్తున్నారంటూ వాపోయారు. తరతరాలుగా తమ ఆధీనంలో ఉన్న భూములకు అక్రమ పట్టాలు తీసుకొని తమను వెళ్లగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ న్యాయం చేయకుంటే తమకు ఆత్మహత్య శరణ్యమంటూ కలెక్టరేట్‌కు పెట్రోల్ క్యాన్‌తో సహా వచ్చారు. ఇదే కోవలో వెదురుకుప్పం మండలం పిల్లారికుప్పం గ్రామ మాల్లూరు ఎస్టీ కాలనీకి చెందిన రాజేంద్ర, రవి తమ గ్రామంలో దాదాపు 70 కుటుంబాలు ఉన్నాయని, అళ్ళమదురు గ్రామంలోని సర్వే నెం:365 లోని బైలులో తమ పశువులను మేపుకుంటున్నామని, ఆది అగ్రవర్ణాల చెందిన భూస్వామి ఆక్రమించుకొని రాత్రిరాత్రే జేసిబితో చదును చేశాడని, ప్రభుత్వ భూమిని కాపాడాలని వేడుకున్నారు.

ఐరాల మండలం పందికొట్టూరు గ్రామానికి చెందిన నాగభూషణం నాయుడు తనకున్న రెండు ఎకరాల స్థలానికి పట్టాదారు పాసుపుస్తకం కోసం ఆరేళ్ళుగా జిల్లా కలెక్టరేట్, రెవెన్యూ అధికారుల చుట్టు తిరుగుతున్నా పట్టించుకోవడం లేదంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫ్లెక్సీతో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తన భూమి సర్వేకోసం డబ్బులు చెల్లించినా సక్రమంగా సర్వే చేసి పట్టాదారు పాసుపుస్తకం రెవెన్యూ అధికారులు ఇవ్వడం లేదంటూ వాపోయారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలంటూ ఐరాల మండలం అబ్బుగుండు దళితవాడ వాసులు కలెక్టర్‌కు వేడుకున్నారు. అత్యవసర వైద్యం కోసం 108 వచ్చే పరిస్థితి కూడా లేదన్నారు. వెదురుకుప్పం మండలం, బివిఎం.పల్లి గ్రామానికి చెందిన శారదమ్మ, మురళి, తరతరాలుగా తమ గ్రామంలో భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం స్టాండింగ్ ఆర్డర్ 15 ఏ 1975 ప్రకారం భూమిని సమానంగా పంచిందని, తమ గ్రామంలోని ఒక వ్యక్తి సదరు భూమిలో ఎక్కువ భాగం రాయించుకుని అమ్ముతున్నాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు. కిడ్నీలు పోయినా పెన్షన్ రాలేదని చిత్తూరు రూరల్ మండలం, సిద్దంపల్లి రైల్వే స్టేషన్ గ్రామానికి చెందిన సుందరమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు వస్తున్న పింఛన్ రూ. 10 వేలు గత ఏడాది రావడం లేదని పింఛన్ ఇప్పించాలని కోరారు.

చంద్రబాబు ఫ్లెక్సీతో భూ సమస్య పరిష్కరించాలని కోరుతున్న నాగభూషణం నాయుడు

భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలుపుతున్న ఎస్ఆర్‌పురం మండలం మాలూరు గ్రామస్తులు

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన వినుతల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన 348 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, డిఆర్ఓ కె.మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, డిప్యూటీ కలెక్టర్ కుసుమ కుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితులో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొత్తంగా 348 అర్జీలు రాగా ఇందులో రెవెన్యూ, సర్వే శాఖకు సంబంధించి 261, పోలీస్ శాఖ 7, పంచాయతీరాజ్ 7, దేవాదాయ శాఖ 3, వ్యవసాయ శాఖ 2, విద్యాశాఖ 4, డ్వామా 2, పౌర సరఫరాల శాఖ 3, డిఆర్‌డిఏ 24, ఇరిగేషన్ శాఖ 3, విద్యుత్ శాఖ 6, సర్వ శిక్ష అభియాన్ 2, ఎల్‌డిఎం 2, పశుసంవర్ధక శాఖ 5, ఉద్యాన శాఖ 4, నేషనల్ హైవే 2, సైనిక్ వెల్ఫేర్ శాఖ 2, గృహనిర్మాణ శాఖ 2, హయ్యర్ ఎడ్యుకేషన్ 1, ఆర్ అండ్ బి 2, ఎస్‌సి వెల్ఫేర్ శాఖ 2, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ 2 అర్జీలు అందాయి.

ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, జెసి విద్యాధరి

అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించండి..

మున్సిపల్ కమిషనర్

చిత్తూరుఅర్బన్: ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ చెప్పారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. నగరపాలక పరిధిలోని పలువురు తమ సమస్యలపై వినతులు సమర్పించగా.. కమిషనర్ సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి సమస్యలు పరిష్కరించాలని, పరిష్కరించిన సమస్యలపై సకాలంలో నివేదికలు అందివ్వాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ 4, పింఛన్లు 1 చొప్పున మొత్తం 5 వినతులు అందాయి. సహాయ కమిషనర్ ఏ.ప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకట రామిరెడ్డి, ఎసీపీ నాగేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న నగర కమిషనర్ నరసింహ ప్రసాద్

అలసత్వం చేయకండి: ఎస్పీ

చిత్తూరుఅర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్.పి శ్రీ తుషార్ డూడి, ఆదేశించారు. సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో 53 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్.పి తుషార్ డూడ స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, నేరుగా ఎస్.పి ,అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ ఎస్.ఆర్.రాజశేఖర రాజు ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. "ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యమని ఎస్పీ తెలిపారు. ఈ ఫిర్యాదులపై తక్షణ చర్య తీసుకొని ప్రజలు న్యాయం పొందేలా చూడాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కి సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు వినతి

జిల్లాలో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక సందర్భంగా కలెక్టర్‌కి సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు వినతిపత్రాన్ని అందించారు. బంగారుపాళ్యం మండలంలో దారి, కాలువ సమస్య పరిష్కారించాలని ఆన్లైన్లో ఫిర్యాదు చేసిన పరిష్కరించకుండానే పరిష్కారం అయిపోయినట్లు అధికారులు చెప్పడం దారుణమన్నారు. పెద్దపంజాణి మండలంలో కూడా సమస్యలు అలాగే ఉన్నాయని, రాత్రికి రాత్రి భూములు ఆక్రమిస్తున్నారని అనుభవంలో ఉన్న వాటిని కూడా దౌర్జన్యంగా ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని ప్రశ్నించారు. జిల్లా ఉన్నతాధికారులు సమస్యలు పరిష్కరించాలని కిందికి ఆదేశాలుస్తున్న కిందస్థాయిలో తహశీల్దార్ స్థాయి నుండి వీఆర్ఓ స్థాయి వరకు ఏమాత్రం లెక్క చేయడం లేదన్నారు.

రెవెన్యూ సమస్యలపై కలెక్టర్ వినతిపత్రం ఇస్తున్న వాడ గంగరాజు

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం

ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నం

పజాశక్తి- చిత్తూరు అర్బన్: గంగవరం మండలంలో మునెమ్మ అనే మహిళ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి, వారు చేస్తున్న దౌర్జన్యానికి సోమవారం యాసిడ్ తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. గంగవరం మండలం భూడిదిపల్లి గ్రామానికి చెందిన దళితులు మునెమ్మ ఆమె భర్త, ఇద్దరు కుమార్తెలు ఊరి ముందర ప్రభుత్వం తమకు కేటాయించి స్థలంలో ఇళ్లు కట్టుకుని గత కొన్నేళ్లుగా జీవనం సాగిస్తున్నారు. అయితే గత సంవత్సరంగా గ్రామంలోని అగ్రకులస్తులు ఊరి ముందు దళితులు ఉండకూడదంటూ వెంటనే ఖాళీ చేయాలంటూ దాడులు, వేధింపులకు పాల్పడ్డారు. దీంతో మునెమ్మ కుటుంబం మరోచోట స్థలం ఇస్తే వెళ్లిపోతామని సిద్ధపడ్డారు. దీనిపై గతంలో ఆర్‌డిఓతో చర్చించడం జరిగింది, కానీ స్థానిక రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహించారు. సోమవారం వారికి స్థలం కేటాయించకుండానే ఖాళీ చేయాలంటూ వారి ఇంటిని జెసిబిలతో అగ్రకులస్తులు కూల్చివేశారు. దీంతో మనస్తాపానికి గురైన మునెమ్మ తమకు అన్యాయం చేస్తున్నారంటూ యాసిడ్ తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ప్రసుత్తం ఆమె చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం, అగ్రకులస్తుల వేధింపుల కారణంగా ఆత్మహత్యయత్నానికి పాల్పడిన మునెమ్మకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, జిల్లా నాయకులు ఓబులురాజు డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె పరామర్శించారు. అలాగే కలెక్టర్, ఎస్పీలకి విషయాన్ని ఫోన్ ద్వారా తెలియజేసి న్యాయం చేయాలని కోరారు.

స్థలవివాదంలో న్యాయం చేయలేదంటూ..

వెదురుకుప్పం: మండలంలోని అల్లంవారికండ్రిగ గ్రామానికి చెందిన ఓ మహిళ తనకు న్యాయం జరగలేదని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన వెదురుకుప్పం మండలంలో సోమవారం చోటుచేసుకుంది. వారి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నల్లవెంగన్నపల్లె పంచాయతీ అల్లంవారికండ్రిగ గ్రామానికి చెందిన రవణమ్మ, అదే గ్రామంలోని చంద్రమ్మ కుటుంబం మధ్య ఇంటి స్థలం విషయంగా గత కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రవణమ్మ ఇంటి స్థలం తన పేరుపై ఉందని కానీ చంద్రమ్మ కుటుంబం దారి సమస్యగా చూపుతూ తరచూ గొడవ పడుతున్నారని విచారించి న్యాయం చేయాలని తహశీల్దార్ బాబుకి వినతిపత్రం అందజేశారు. తహశీల్దార్ విచారించి న్యాయం చేస్తామని చెప్పారు. కానీ తక్షణం తమకు న్యాయం చేయాలంటూ రవణమ్మ తహశీల్దార్ కార్యాలయం వద్దే పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను 108 ద్వారా తిరుపతి రుయాకు తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది. ఆరోగ్యం నిలకడగా ఉంది. దీనిపై తహశీల్దార్ బాబును వివరణ కోరణా.. బాధిత మహిళ సమస్యపై వచ్చి వినతిపత్రం ఇచ్చారని రెవెన్యూ సిబ్బందిని గ్రామానికి పంపి విచారిస్తామని చెప్పామన్నారు. ఈ ఘటనతో వెంటనే తమ సిబ్బందిని అల్లంవారి కండ్రిగ గ్రామానికి పంపామని విచారించి న్యాయం చేస్తామని చెప్పారు.

రవణమ్మను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

క్షయ వ్యాధిని నివారించాలి

టిబి వ్యాధిగ్రస్తులకు కిట్లను అందిస్తున్న కలెక్టర్, జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: టిబిని చికిత్స ద్వారానే కాకుండా నివారణ ద్వారా కూడా ఓడించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని 100 మంది క్షయ వ్యాధి గ్రస్తులకు రూ.500లు విలువ గల ఆహార పదార్థాలను అందజేశారు. అలాగే 100 మంది క్షయ వ్యాధి గ్రస్తులకు 6 నెలలకు సరిపడా ఆహార పదార్థాలను ఇవ్వడానికి జిల్లా కలెక్టర్ నిశ్చయించారు. క్షయ వ్యాధిగ్రస్తులు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకొని క్షయవ్యాధిని నివారిద్దామని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించవచ్చునని తెలిపారు.

మహిళల ఆరోగ్య సమస్యలను గుర్తించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిల పరిధిలో మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు అమలు తీరుపై సోమవారం డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుధారాణి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వరహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పిహెచ్‌సిల పరిధిలోని డాక్టర్లు, స్టాఫ్ ఎఫ్ఆర్ఎస్ తప్పనిసరిగా హెడ్ కోటర్‌లో వేయాలన్నారు. 18 సంవత్సరాలు పైబడిన ప్రతి మహిళకు ఎలాంటి అనారోగ్య సమస్యలున్నా వెంటనే స్క్రీనింగ్ చేసి సంబంధిత చికిత్స చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి అభ ఐడి క్రియేషన్ తప్పక చేయాలన్నారు. కౌమార దశ బాలికలకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు రక్తహీనత పరీక్షలు చేసి ఐరన్ మాత్రల పంపిణీ చేయాలన్నారు. అనుమానితులందరికీ కేన్సర్ పరీక్ష చేయాలన్నారు. దగ్గు ఉన్న వాళ్ళందరికీ టీబి పరీక్ష చేసి పాజిటివ్ వస్తే వెంటనే చికిత్స ప్రారంభించాలన్నారు. 70 సంవత్సరంలో పైబడిన వారికి అందరికీ సీఎం జేఏవై కార్డులు ఇప్పించాలన్నారు. అర్హులందరికీ ప్రధానమంత్రి మాతత్వ వందన యోజన రూ.6000లు పథకాన్ని అమలు చేయాలన్నారు. మాత శిశు సంరక్షణ సేవలో శనివారానికి 100శాతం తప్పక చేయాలన్నారు. డాక్టర్లు ప్రతిరోజు ఈ అన్ని కార్యక్రమాలపై మానిటర్ చేస్తూ అన్ని యాప్స్‌లో నూరు శాతం రావాలని తెలిపారు. సీజనల్ వ్యాధులపై మలేరియా, డెంగీ, డయేరియాపై నిఘా ఉంచి అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్లు వెంకట ప్రసాద్, హనుమంతరావు, ప్రవీణ, అనూష, నవీన్ తేజ్ రాయి, అర్పిత, శ్రీవాణి పాల్గొన్నారు.



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఓ

ఏళ్ల తరబడి సాగుచేస్తున్నాం.. పట్టాలివ్వండి..

- పంట భూముల పక్కన క్వారీకి అనుమతులివ్వకండి
- తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎస్టీల నిరసన

ప్రజాశక్తి- విజయపురం (నగరి): కొండగుట్టల పక్కన యేళ్లతరబడి బీడుగా ఉన్న భూములు సాగుచేసుకుంటూ జీవిస్తున్నాం.. మాకు వేరే జీవనాధారం లేదు.. మేము సాగుచేసే భూములకు మా పేరిట పట్టాలు ఇవ్వండంటూ తడుకుపేట, ముడిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన వంద మంది షెడ్యూలు తెగలవారు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సోమవారం జడ్పీటీసీ సభ్యుడు గాంధీ, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి గోవిందస్వామి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్న వారు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్టీలు మాట్లాడుతూ తడుకుపేట, ముడిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన తాము చలపరకోన కొండగుట్టల నడుమ సర్వే నెంబరు 245లోని గుట్టల్లో అతికష్టం మీద భూమి చదును చేసి సాగు చేసుకుంటున్నామని అన్నారు. ప్రస్తుతం మామిడి చెట్లు సాగులో ఉందన్నారు. ఆ భూములు తప్ప తమకు వేరే జీవనాధారం లేదన్నారు. సుమారు 30 కుటుంబాల వారు ఆ స్థలంలోనే నివాసాలు కూడా ఏర్పరచుకున్నామన్నారు. 20 యేళ్లుగా భూములు తమ ఆధీనంలోనే ఉందని తామే సాగు చేసుకుంటున్నామన్నారు. పలుమార్లు పట్టాల కోసం అధికారులను సంప్రదించినా పట్టాలు అందలేదన్నారు. ప్రస్తుతం ఇదే సర్వే నెంబరులో గుట్టలను రాజకీయ పలుకుబడి ఉన్న నేతలకు క్వారీ నిమిత్తం అత్యంత వేగంగా అనుమతిచ్చారన్నారు. ఆ ప్రాంతంలో క్వారీ వస్తే సాగుచేసే భూములున్న ప్రాంతానికి వెళ్లేందుకు దారికూడా ఉండదన్నారు. పంటలు నాశనమవడంతో పాటు, అక్కడ నివాసాలున్న వారికి అపాయం జరిగే ఆస్కారముందన్నారు. పశువులకు మేత కూడా లేని పరిస్థితి నెలకొంటుందన్నారు. ప్రభుత్వం తాము సాగుచేసే భూములకు పట్టాలిచ్చి ఆదుకోవాలని, తమ భూములున్న ప్రాంతంలో క్వారీలకు అనుమతివ్వరాదని కోరుతూ తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ క్వారీకి సంబంధిత అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. పట్టాలు కావలసిన వారు సంబంధిత సచివాలయంలో ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


తహశీల్దార్‌కు వినతి ప్రతం ఇస్తున్న దళితులు

ఎస్టీలు సాగు చేస్తున్న మామిడి తోట

మామిడి రైతులకు రూ.157 కోట్ల సబ్సిడీ: కలెక్టర్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా రీ ఓపెన్‌కి ఆస్కారం లేకుండా నాణ్యతతో పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, మునిసిపల్ కమీషనర్లు, తహశీల్దార్లు, మండల ఎంపీడీవోలు, వ్యవసాయ, ఆర్టికల్చర్, సెరికల్చర్, మండల సర్వేయర్లు, తదితర అధికారులతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిజిఆర్ఎస్ అర్జీలు పరిష్కారంపై, ఈ క్రాప్, స్వమిత్వ, ఈ ఆఫీస్ ఫైల్స్‌ల పెండెన్సీ, ఈపిటిసి, ఇతర విషయాలపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పలు అంశాలపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి, డిఆర్ఓ మోహన్ కుమార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నాణ్యతతో గడువులోగా పరిష్కారం చూపాలని, ఎలాంటి అలసత్వం ఉండరాదని తెలిపారు. పరిష్కారం చూపలేని అర్జీదారునికి స్పష్టంగా ఎండార్స్మెంట్ చేసి తెలపాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్‌లో సుమారు 200 నుంచి 300 అర్జీలు అందుతున్నాయి దాదాపు 30 శాతం వినతులు మండల స్థాయిలో పరిష్కారం అయ్యేవేనని, వీటి పరిష్కారానికి మండల స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీసు, సర్వే, ఆర్ డబ్ల్యుఎస్ శాఖలో వినతులు ఎక్కువ ఉన్నాయని, వీటితో పాటు అన్ని శాఖలలో బియాండ్ ఎస్ ఎల్ఓ అర్జీల సంఖ్య తగ్గాలని, వీటికి వెంటనే పరిష్కారం చూపాలన్నారు. అర్జీల పరిష్కారం అనంతరం వినతులను ఆడిట్ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు సమస్యలను ముందుగా గుర్తించి పరిష్కరించాలని అందుకు మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో రైతుల ఈ పంట నమోదు ప్రక్రియ 100శాతం నిర్వహించాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ, సెరికల్చర్ అధికారులు, ప్రతిరోజు నిర్వహించే టూర్ డైరీ సంబంధిత జిల్లా అధికారులకు అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో మామిడి పంట పండిన రైతులకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రూ.157 కోట్ల జిల్లాకు అందజేయుచున్నదని తెలిపారు.

ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తుషార్ డూడి సోమవారం జిల్లా కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారికను మర్యాదపూర్వకంగా కలశారు.

ఉపాధ్యాయ సమస్యలపై జెడ్పీ సీఈవోకు వినతి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం యుటిఎఫ్ నాయకులు జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడును కలసి వినతిపత్రం అందజేశారు. బీమా మెచ్యూరిటీ చెల్లింపులు, కొత్తబాండ్ల జారీ, నామినీల మార్పు వంటి సమస్యలను జెడ్పి సీఈవో దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు సంబంధించి జమకాకుండా ఉన్న మొత్తాలను జమ చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, జడ్పీ పిఎఫ్ ఖాతాలపై రుణాల మంజూరులో సీలింగ్‌ను తొలగించాలని, ఆన్లైన్ స్లిప్పులను పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులను సరిచేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా ఖజానా అధికారిని కలిసి రిటైర్ ఉపాధ్యాయుల పెన్షన్లకు సంబంధించిన జాప్యాన్ని నివారించాలని కోరారు. జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట రమణని కలిసి అనేక పాఠశాలలు మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్పు చేయబడినందువల్ల ఆయా పాఠశాలల్లో పిల్లల నమోదు పెరిగిందని, ఆ పిల్లలకు తగ్గట్టుగా పాఠశాలలో వసతులు, ఫర్నిచర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా విద్యాశాఖధికారి కార్యాలయంలో కార్యాలయ ఏడీని కలిసి మధ్యాహ్నం భోజనం బియ్యాన్ని పాఠశాల స్థాయికి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయుల సర్వీసు రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులు కొంతమందికి కేడర్ మారలేదని దానిపై చర్యలు తీసుకోవాలని కోరారు. యుటిఎఫ్ నాయకులు రమణ, సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, రెహానాబేగం, రెడ్డప్ప నాయుడు, సరిత, గణేష్ కుమార్, సుధాకర్ నాయుడు, దాసరి మునెయ్య, శ్రీదేవి, వయ్యాల మధు, జగన్మోహన్ రెడ్డి, సర్దార్, చిరంజీవి పాల్గొన్నారు.

జెడ్పీ సీఈవోకి వినతి పత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

వైద్య ఆరోగ్య శిబిరం

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : మండలంలోని ఎం కొత్తూరు సచివాలయం ఆవరణలో 'స్వస్థ నారీ సశక్త పరివార్ అభియాన్' ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు.

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మోహనరూప

వైద్యాధికారులు, వైద్య నిపుణులు పాల్గొని చికిత్స అందించారు. 191 మంది ఈ శిబిరంలో వైద్యసేవలు అందుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మోహన రూప మాట్లాడుతూ ఒక ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉన్నట్లే అన్నారు. స్వస్థ నారీ సశక్తి పరివార్ ఉద్దేశాలను.. ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య పరీక్షలు, సదుపాయాలను, ఎన్‌సిడి స్క్రీనింగ్, కేన్సర్ స్క్రీనింగ్, ఆభా ఐడీ నమోదు, నిక్షయ్ ఐడీ, పీఎంజేఏవై, పీఎంఎంవీవై పథకాలపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరంలో పీహెచ్‌ఎన్ అమరావతి, ఎంఎల్‌హెచ్‌పి సుశీలమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రొంపిచర్ల: రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ స్వశక్త పరివార్ అభియాన్‌లో డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, డాక్టర్ వినయ్ ఆధ్వర్యంలో 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక వైద్యాధికారులు కంటి వైద్య నిపుణులు డాక్టర్ ప్రసాద్ రాజు, గర్భ కోశ వ్యాధి నిపుణులు డాక్టరు పుష్పకుమారి, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టరు షఫీ, దంత వైద్య నిపుణులు డాక్టరు అజిత విచ్చేశారు. మండలంలో మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి ఆరోగ్యవిద్య గురించి బోధించారు. పోషకాహారం తింటూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు దినేష్ కుమార్ నాయక్, డాక్టర్ వినయ్, సిహెచ్‌ఓ అమ్మాణ్ణి, ఐసిడిఎస్ సూపరువైజర్ శిరీష, హెల్త్ సూపరువైజర్ పంకజ, టిబి సూపర్ వైజర్ లక్ష్మీపతి, యంఎల్‌హెచ్‌పి లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రొంపిచర్ల: రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారి స్వశక్త పరివార్ అభియాన్ కార్యక్రమం డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, డాక్టర్ వినయ్ ల ఆధ్వర్యంలో 200 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక వైద్యాధికారులు కంటి వైద్య నిపుణులు డాక్టరు ప్రసాద్ రాజు, గర్భ కోశ వ్యాధి నిపుణులు డాక్టరు పుష్పకుమారి, చిన్న పిల్లల వైద్య నిపుణులు డా. షఫీ, దంత వైద్య నిపుణులు డాక్టరు అజితా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు దినేష్ కుమార్ నాయక్, డాక్టర్ వినయ్, సి హెచ్ ఓ అమ్మాణ్ణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ శిరీష, హెల్త్ సూపర్వైజర్ పంకజ, టి బి సూపర్ వైజర్ లక్ష్మీపతి, యం ఎల్ హెచ్ పి లు, ఏ యన్ యం లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం : కిశోర బాలికలు రుతు చక్రంలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రతపై ఆ సమయంలో ఎదుర్కొనే సమస్యలపై కార్వేటి నగరం ప్రాజెక్ట్ ఐసిడిఎస్ సిడిపిఓ శోభారాణి ఆరిమాకులపల్లి ,ముద్దికుప్పం శెట్టి వానాత్తం అంగన్వాడి కేంద్రం ఆధ్వర్యంలో కిశోర బాలికల కిషోర్ వికాసం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్వేటినగరం ప్రాజెక్ట్ సిడిపిఓ శోభారాణి, ఎస్ఆర్ పురం వైద్యాధికారి సమామ్ రహమాన్, ఆర్యమాకులపల్లి వైద్య అధికారి డాక్టర్ బాలాజీ చరణ్, అంగన్‌వాడీ సూపర్వైజర్ సచివాలయ సిబ్బంది ఆశా వర్కర్లు కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

కూటమి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి- కుప్పం: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీను తగ్గించడంతో కుప్పంలో కూటమి శ్రేణులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. కుప్పం ఎన్టీఆర్ కూడలిలో బిజెపి కుప్పం నియోజకవర్గ అధ్యక్షులు తులసినాథ్ ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున బాణా సంచా పేలుస్తూ ప్రధాని, ఆర్థిక శాఖ మంత్రి ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి కుప్పం ఇన్‌చార్జ్ తులసీనాథ్, రెస్కో చైర్మన్ ప్రతాప్, కడ అడ్వైజరీ కమిటీ సభ్యుడు రాజ్ కుమార్, టిడిపి కుప్పం అర్బన్ అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, జనసేన కుప్పం ఇన్‌చార్జ్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవం

రొంపిచర్ల : పులిచెర్ల మండలం కొమ్మి రెడ్డి గారి పల్లి అంగన్‌వాడీ కేంద్రలో సోమవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఆకుకూరలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు, రాగులు, పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పంపిణీ చేసే పౌష్టికాహారం పాలు, గుడ్లు, బియ్యం, బాలామృతాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీ నెరవేర్చాలి

ప్రజాశక్తి- విజయపురం: కూటమి ప్రభుత్వం ఎన్నికల ఇచ్చిన హామీ ప్రకారం ఆశ వర్కర్స్ జీతాలు పెంచుతూ, ఉద్యోగ భద్రత కల్పించాలి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం విజయపురం, నింద్ర మండల తహశీల్దారు కార్యాలయ ఎదుట ఏఐటీయూసీ నాయకులు, ఆశవర్కర్లు ధర్నా నిర్వహించారు.

వైద్యాధికారులకు సన్మానం

ప్రజాశక్తి- కార్వేటినగరం : మండల వైద్యాధికారులను ఈదువారి పల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య భవనంలో ప్రారంభించిన స్వస్థ నారి శక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ ప్రియాంకలను టిడిపి యువ నాయకుడు ప్రొద్దుటూరు రాజా, నాయకులు శివకుమార్, సురేంద్రబాబు, జనార్దన్, అన్నయ్య, చంద్రశేఖర్లు శాలువాలు కప్పి సన్మానించారు. వైద్యాధికారులు కూడా వారికి శాలువాలు కప్పి సన్మానించారు. రాజా మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని పేర్కొన్నారు.

వైద్యాధికారులను సన్మానిస్తున్న నాయకులు

ఆర్థిక లావాదేవీలపై అవగాహన

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం రైతులకు ఆర్థిక లావాదేవీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అధ్యక్షులు బాలాజి సంఘంలో అమలుచేస్తున్న వివిధ పతకాల గురించి వివరించారు. గతంలో తీసుకున్న ఎల్‌టీ లోన్లు, ఎస్టీ లోన్లు త్వరగా చెల్లిస్తే అధిక మొత్తంలో రుణాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో తులసిపిళ్లై, బ్రాంచి మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఆనంద్ పాల్గొన్నారు.

మత్తుపదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన

ప్రజాశక్తి -విజయపురం (నగరి): మండలంలోని ఎం కొత్తూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు 'సే నోటూ ఆల్కహాల్ అండ్ డ్రగ్స్, హరాస్మెంట్, బ్యాడ్ హ్యాబిట్స్, సే ఎస్ టు ఎ బ్రైట్ ఫ్యూచర్' పేరిట ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఇ.చామంతి మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, చెడు అలవాట్ల వల్ల కలిగే నష్టాలు, లైంగిక వేధింపులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంచి భవిష్యత్తుకు సత్ప్రవర్తన ఎంత ఉపయోగపడుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని గీతాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీ ఇచ్చారు..అమలు మరిచారు..!

- ప్రత్యామ్నాయం చూపాలని రైతుల వినతి
- ఏటా తగ్గుతున్న సాగు విస్తీర్ణం
- వ్యవసాయ రంగాన్ని వేధిస్తున్న సాగు ఖర్చు
- ఉపాధి అనుసంధానం కోసం రైతుల నిరీక్షణ

ప్రజాశక్తి - వెదురుకుప్పం: గ్రామీణ జాతీయ ఉపాధి హామీని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తే రైతాంగానికి ఎంతో మేలు చేకూరుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉపాధి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగంలో రైతులకు సాగు ఖర్చు విపరీతంగా పెరిగిపోయిందని చెబుతున్నారు. బిజెపి కూటమి ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని గాలికి వదిలేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాగు ఖర్చులు పైపైకి.. తగ్గుతున్న విస్తీర్ణం

వ్యవసాయ రంగంలో రైతులు పెడుతున్న పెట్టుబడులు కూడా రావటం లేదని, కూలీ ఖర్చులు, ఎరువుల ధరలు, ఇతరత ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయని చెబుతున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్లో వరి పంటకు రూపాయలు సుమారు 30 వేల రూపాయలు ఖర్చు అవుతోందని రైతులు అంటున్నారు. వేరుశనగ, వరి పంటలు కూడా భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని వారు భావిస్తున్నారు. మొత్తం పెట్టుబడి పెట్టి చేతికి వచ్చిన పంట ఖర్చు లెక్కేసుకుంటే.. రైతన్నల గుండె తరుక్కుపోతోందని వారు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు మహిళలకు రూ.300, పురుషులకు రూ.600 ఇచ్చి వారికి ఒక పూట భోజనం సైతం పెట్టాల్సి వస్తోందని, వీలైతే ఉదయం పూట టిఫిన్ కూడా అందియ్యాల్సి వుందన్నారు. వ్యవసాయ అనుసంధానమైన కూలీకు ఖర్చులు పెరగడం తప్ప తగ్గే లేదని వారి అభిప్రాయం. దీంతో ఈ ఉపాధి హామీ ఉంటే వ్యవసాయ పనులకు అన్వయిస్తే కొంత

ఖర్చు భారమైనా తగ్గుతుందని రైతులు వాపోతున్నారు.

పెరిగిన ఖర్చులతో పట్టణాల వైపు పరుగులు

కూలీల, పెట్టుబడి ఖర్చులతో వ్యవసాయాన్ని ఆపేసి పలువురు పట్టణాల వైపు చిన్న చిన్న పనులకు వెళుతున్నట్టు చెబుతున్నారు. రైతులకు మేలు చేసే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మండలంలో మొత్తం 25 పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీలో చాలా వరకు రైతు కుటుంబాలే వున్నాయి.

పెట్టుబడులు అధికం

వ్యవసాయ రంగంలో రోజు రోజుకూ కూలీల ధరలు పెరిగి పెట్టుబడి ఖర్చులు పైపైకి చేరు కుంటున్నాయి. ఈ సమస్య రైతులను వేధిస్తోంది. పెట్టుబడి ఖర్చులు కొంతవరకు తగ్గాలంటే ఉపాధి హామీని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలి.. ప్రభుత్వాలు ఇందుకు అడుగులు వేయాలి.. అప్పుడే రైతుకి మేలు చేకూరుతుంది.

- చంగల్ పండు రెడ్డి, వెంకటరెడ్డి కండ్రిక, మాంబేడు పంచాయతీ, వెదురు కుప్పం మండలం.

వ్యవసాయ రంగానికి ఉపాధి కూలీలను మళ్లించాలి

వ్యవసాయ రంగానికి ఉపాధి కూలీలను మళ్లించాలి. ప్రభుత్వాలు దీనిపై స్పందించాలి. ఈ పనుల వేతనం తో ఎక్కడెక్కడో పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు చేస్తోంది. అదే వ్యవసాయ రంగానికి మళ్లిస్తే రైతు కుటుంబాలు లాభపడుతాయి.

- నాధముని, రైతు వెదురుకుప్పం మండలం.

వ్యవసాయం కష్టతరం

మా వ్యవసాయ పొలంలో వరి పంట కోశాం.. వరి గడ్డిని పశువులకు మేత కోసం దాచి పెట్టుకుందామని ప్రయత్నిస్తే కూలీల ఖర్చులు అధికంగా వున్నాయి. అంత దబ్బు వెచ్చించే స్థోమత లేక వదిలేశాను. వ్యవసాయ పనులకు కరువు పని మళ్లించాలి. అప్పుడే రైతు బాగుపడతాడు.

- రామకృష్ణయ్య, మాంబేడు హరిజనవాడ, వెదురుకుప్పం మండలం.

అన్న క్యాంటీన్ పరిశీలన

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను కడ అడ్వైజర్ కమిటీ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్ సోమవారం పరిశీలించారు. అన్న క్యాంటీన్‌లో ఏ మేరకు నాణ్యమైన భోజనం పెడుతున్నారని ఆరా తీశారు. పేదలకు మూడు పూటల కడుపునిండా అన్నం పెట్టాలనే ఉన్నతాశయంతో అన్న క్యాంటీన్ లను సీఎం ఏర్పాటు చేశారని నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని రాజ్ కుమార్ పేర్కొన్నారు. అన్నం వృథా చేయకుండా వడ్డించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో రెస్కో డైరెక్టర్ శివ, వన్ని కుల క్షత్రియ డైరెక్టర్ వేణు పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -సోమల: సోమల మండల అభి వృద్ధి అధికారి గా జి వి ఎస్ వి ప్రసాద్ సోమవారం బాధ్య తలు స్వీక రించారు. ఈయన నెల్లూరు జిల్లా సంఘం మండలం డిప్యూటీ ఎంపీడీవో గా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉద్యోగోన్నతిపై సోమల మండల అభివృద్ధి అధికారిగా వచ్చారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో నారాయణ, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, మండల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి దుశ్శాలువతో సన్మానించారు. ఎంపీడీవో జీవీఎస్ వి ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగోన్నతిపై పై సోమల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందని మండల పరిస్థితులు అవగాహన చేసుకుని అభివృద్ధిపై దృష్టి సారిస్తానని తెలిపారు.

నూతన ఎంపీడీవోజివిఎస్‌వి ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - విజయపురం (నగరి) : స్వచ్ఛత హి సేవ సఫాయిమిత్ర సురక్ష సివిర్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పుదుపేట అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి సమక్షంలో మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో సత్రవాడ, పుదుపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్లు ఎయిల్ అరసన్, బిందు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, పురపాలక సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెస్ టోర్నమెంట్‌లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : మండలంలోని ముడిపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థి ఎం.నవ్య చెస్ ఆటలో ప్రతిభ కనభరచింది. చెన్నై నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన ఇంటర్నేషల్ ఫైడ్ రేపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొన్న దివ్య అండర్ 15 విభాగంలో 8వ స్థానం కైవసం చేసుకుంది. ప్రతిభ కనభరిచిన విద్యార్థిని, కోచ్ ఆనంద మోహన్‌ను, పీడీ వెంకటేశ్వర్లును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళికృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

డెయిరీని పరిశీలించిన విద్యార్థులు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలం లోని డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ విభాగం విద్యార్థులు తిరుపతి జిల్లా అవిలాలలో ఉన్న బాలాజీ డెయిరీని సోమవారం సందర్శిం చారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి అన్నపూర్ణ శారద సోమవారం తెలిపారు. విద్యార్థులకు పాడి ఉత్పత్తుల గురించి వాటి నాణ్యత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో ఎకనామిక్స్ డిపార్టుమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ లావణ్య కుమారి, అతిథి అధ్యాపకులు డాక్టర్ కే పాండ్యరాజ్ విద్యార్థులకు మార్గదర్శం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పాల డెయిరీని పరిశీలించిన డిగ్రీ విద్యార్థులు

రూ.8లు ఇప్పించేలా చర్యలు తీసుకుంటాం..

శాసనసభలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మామిడి రైతులకు ఫ్యాక్టరీలు ఇవ్వాల్సిన రూ.8లపై రోజూ ప్రశ్నిస్తున్నారని దీనిపై స్పందించాలని కోరారు. స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ కొన్ని మామిడి గుజ్జు పరిశ్రమలు ప్రభుత్వం నిర్ణయించిన తోతాపురి మామిడి ధర కిలో రూ.8లు ఇవ్వడం లేదని, వారిని పిలిచి మాట్లాడి.. రైతులకు గిట్టుబాటు ధర అందిస్తాం' అని సోమవారం శాసనసభలో మంత్రి పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సొంత జిల్లా చిత్తూరులో మామిడి పంట విపరీతంగా పండిందని, తోతాపురి మామిడి రకం కొనేవారు లేక పోవడంతో సిఎం వెంటనే స్పందించి మంత్రి, అధికారులను, మామిడి పరిశ్రమల వారితో మాట్లాడి గిట్టుబాటు ధర నిర్ణయించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. రైతులను ఆదుకోవాలని ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు తోతాపురి కిలో రూ.4 రాయితీ ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. మామిడి రైతుల కోసం రూ.261 కోట్లు ఖర్చు చేశామని, ఇది రైతుల పట్ల చిత్తశుద్ధి కలిగిన ప్రభుత్వమని బడ్జెట్లో పెట్టాల్సిన అవసరమే లేదని, రైతుల కోసం తీసుకున్న నిర్ణయమన్నారు. ఏ పంటకు ధర తగ్గినా.. ప్రభుత్వం సత్వరం స్పందించి రైతులను ఆదుకోంటుందన్నారు.

వృత్తి నైపుణ్యాలు అలవరుచుకోవాలి: హెచ్‌ఎం

ప్రజాశక్తి -కార్వేటినగరం : విద్యార్థులు తమ పాఠశాల విద్యలో భాగంగా కేవలం పుస్తక పరిజ్ఞానంకే పరిమితం కాకుండా వృత్తి పరమైన నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా భవిష్యత్తులో తనకు నచ్చిన రంగంలో కృషిచేసి స్వయం సమృద్ధి సాధించవచ్చని కత్తెరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి చెంగల్రాజు అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా కత్తెరపల్లె ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి విద్యార్థిని విద్యార్థులు 30 మందికి వృత్తి విద్యా కార్యక్రమంలో భాగంగా పది రోజుల శిక్షణ పాఠశాలలో సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, కత్తెరపల్లె క్రెడిట్ ఆఫీసర్ జాషువా పాల్గొని విద్యార్థులకు సూచనలు అందించారు. విద్యార్థులకు ఐ టి ఐటీ, బి ఎస్ ఎఫ్ ఐ ట్రేడ్ లలో ఒక్కో ట్రేడ్ లో 15 మంది చొప్పున 30 మందికి వృత్తిపరమైన అనుభవపూర్వక శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు స్థానిక గ్రామ సచివాలయం, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులలో పది రోజుల పాటు శిక్షణలో పాల్గొంటారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సమగ్ర శిక్ష ద్వారా ధ్రువపత్రాలు పంపిణీ చేస్తారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సర్దార్, వెంకటేశులు, ఫయాజ్, రూప, బాలసుబ్రహ్మణ్యం, వృత్తివిద్యా శిక్షకులు హరికృష్ణ, ప్రవీణ్ పాఠశాల జూనియర్ సహాయకులు హరిప్రకాష్ , విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రామస్థులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు

గ్రంథాలయాలను విద్యాలయాలుగా మార్చడమే లక్ష్యం

రాష్ట్ర గ్రంథాలయ బోర్డు డైరెక్టర్ మునస్వామి

ప్రజాశక్తి- రామకుప్పం: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజక వర్గాలలోని గ్రంథాల యాలను ఆధునీకరణ కోసం దాదాపు 150 కోట్ల రూపాయ ల నిధులు మంజూరు చేసి, అన్ని గ్రంథాల యాలను విద్యాలయాలుగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్, రాష్ట్ర టిడిపి ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు మునుస్వామి పేర్కొన్నారు. ప్రతి నియోజక వర్గంలోను గ్రంథాలయాల అభివృద్ధికి శోభా డెవలపర్స్ వాళ్లు రూ.100 కోట్లు విరాళాలు ఇచ్చారన్నారు. రానున్న 24 నెలల్లో అన్ని లైబ్రరీలను పూర్తిచేసి మంత్రి రాష్ట్రానికి కానుకగా ఇవ్వను న్నారని ఆయన పేర్కొన్నారు. అన్ని గ్రంథాలయాల్లో అవసరమైన పుస్తకాలు కోసం, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయడం కోసం ముఖ్యమంత్రి ప్రత్యేక చొర వ చూపారని, దానికి అనుగుణ ఏర్పాట్లు చేస్తున్న ట్లు ఆయన తెలిపారు. గ్రామ సచివాలయంలో రీడింగ్ రూములు, వసతులతో కూడిన సదుపాయాలు కల్పనకు మంత్రి కృషి చేస్తున్నా రన్నారు. కుప్పం నియోజక వర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రంథాలయాలను ఆధునీకరించి ప్రత్యేకంగా నిలుపుతా రన్నారు.

మంత్రి లోకేష్‌తో గ్రంథాలయ బోర్డు డైరెక్టర్ మునస్వామి

దోబీ ఘాట్‌ను పరిరక్షించండి

ప్రజాశక్తి - రొంపిచర్ల: రొంపిచర్ల మండలం నగరి మడుగు వారి పల్లిలో 2005లో దోబీ ఘాట్‌కు సర్వే నెంబరు 1041లో 0.40 సెంట్లు ప్రభుత్వం కేటాయించి నిర్మించి ఇచ్చిన దోబీ ఘాట్ ఆక్రమణకు గురైందని దీన్ని పరిరక్షించి తగిన సౌకర్యాలు కల్పించాలని రజ సంక్షేమ సంఘం నాయకులు రొంపిచర్ల ఇన్‌ఛార్జి ఎంపీడీవో రెడ్డప్ప ఆచారికి, తహశీల్దారు అమరనాథ్ కి సోమవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ దోబీఘాట్ నిర్మించి ఇచ్చినప్పటి నుండి 20 ఏళ్ల వినియోగంలో వుందన్నారు. ప్రస్తుతం దోబీ ఘాట్ లోని నీటి తొట్టెలు, బెడ్ లు, బండలు, పైపులు పాడై పోయాయని, మోటారు సరిగ్గా పనిచేయడం లేదని తెలిపారు. దోబీ ఘాట్ చుట్టూ కంచె లేని కారణంగా చుట్టుపక్కల వాళ్ల పశువుల దొడ్లు, పేడ దిబ్బలు, గడ్డి వాములు వేసుకొని ఆక్ర మించుకుంటున్నారు. ఆక్రమణకు గురికాకుండా దోబీ ఘాట్ స్థలానికి కంచె ఏర్పాటు చేయాలని, మోటారు, స్టార్టరు విద్యుత్తు మీటర్ ఏర్పాటు చేయాలని, వర్షాకాలంలో ఉతికిన బట్టలు ఆరబెట్టుకునేందుకు భద్రపరచుకోవడానికి షెడ్డు కావాలని కోరారు. ఈ విషయాన్ని బీసీ కార్పొరేషన్ , ఈడీ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని రజక సంక్షేమ సంఘం నాయకులు పి గుర్రప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని రజకులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న రజక సంఘం నాయకులు

ద్రవిడ విశ్వవిద్యాలయంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర

ప్రజాశక్తి -గుడిపల్లి: 'ద్రవిడ విశ్వవిద్యాలయ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం' సోమవారం నిర్వహించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టరు హరికృష్ణ ఆధ్వర్యంలో టెర్రస్ గార్డెనింగ్, మల్టిపుల్ క్రాపింగ్ అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయ వార్ధిని, అధ్యాపక బృందం విద్యార్థులను ఉద్దేశించి విద్యార్థులు రైతుల వ్యవసాయంపై ఇన్‌పుట్ పెట్టుబడిని తగ్గించుకోవడానికి కల ప్రత్యామ్నాయ మార్గాలను ఆలోచించాలని కోరారు. డాక్టర్ శోభ, డాక్టర్ శైలమ్మ, డాక్టర్ శ్రీనివాసు లు, సేంద్రీయ ఎరువు తయారీ పై వర్క్ షాప్ ను నిర్వహించి ప్రతి విద్యార్థి తమ ఇంటి వద్ద సేంద్రీయ ఎరువు తయారీని చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన విశ్వ విద్యాలయ యాజమాన్యానికి స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ యశోద ధన్యవాదాలు తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న డిగ్రీ కళాశాల సిబ్బంది

గోపాలమిత్ర సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: పాడి రైతులు గోపాలమిత్ర సేవలను ఉపయోగించుకోవాలని పశువైద్య ఏడీ ఆసిఫ్ అన్నారు. సోమవారం మండలంలోని వుటువంక గ్రామంలో పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తిరిగి గోపాల మిత్రులను ప్రారంభిస్తున్నామని గ్రామాల్లోని పాడి రైతులు గోపాలమిత్ర సేవలను ఉపయోగించుకోవాలన్నారు. 35వ జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ మందులను ఉపయోగించుకోవాలని ఆరు మాసాలు నిండిన పశువులకు వైద్య పరీక్షలు చేయించోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు పలువురు పాడి రైతులు చిట్టిబాబు పరదేశి పాల్గొన్నారు.

నేడు లోక్ కల్యాణ మేళా

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు మున్సిపల్ కౌన్సిల్ హాలులో మంగళవారం సాయంత్రం గంటలకు 'లోక్ కళ్యాణ మేళా" నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ప్రకారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పలమనేరు పురపాలక సంఘం పరిధిలో ఈ నెల 23వ తేదీ 3 గంటలకు 'లోక్ కళ్యాణ మేళా' ను పలమనేరు కౌన్సిల్ హాలులో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో వీధి విక్రయ దారులకు, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక ఉచిత హెల్త్ క్యాంపును నిర్వహిస్తామని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

నీటి నిలుపుదలకు చర్యలు : కార్పొరేటర్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : చిత్తూరు నియోజకవర్గం పరిధిలో తెగిన కాజూరు చెరువు సప్లై చానల్ నీటిని నిలిపేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ అశోక్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. చిత్తూరు నియోజకవర్గం పరిధిలోని తెగిన కాజూరు చెరువు సప్లై చానల్ నుంచి వృథాగా ప్రవహిస్తున్న నీటిని కార్పొరేటర్ అశోక్ సోమవారం ప్రజలతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు విస్తారంగా కురు స్తున్నాయని తెలిపారు. చిత్తూరు నగర పరిధి లోని పలు కుంటలు, చెరువులు జలకళను సంతరించుకున్నాయని చెప్పారు. అయితే కాజూరు లాంటి చెరువు సప్లై చానల్ తెగి నీరు వృథాగా పోవడం బాధాకరమన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు వెంటనే చొరవచూపాలని కోరారు. చెరువును నింపే సప్లై చానల్ తెగి పక్కదారి పడుతున్న నీటిని నిలుపుదల చేసేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కాలయాపన చేస్తే చెరువులోకి వర్షపు నీరు చేరకుండా చెరువు ఎండి పోయే ప్రమాదం వుందని ఈ విషయంలో సంబంధిత అధికారులు అప్రమత్తతో వ్యవహరించి, నీటి పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ప్రతి వర్షపునీటి బొట్టును వడిసిపట్టుకునేందుకు ఉపక్రమిద్దామని అశోక్ పిలుపునిచ్చారు.

క్రైం న్యూస్

అదుపు తప్పి లారీ బోల్తా

డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: అదుపుతప్పి లారీ బోల్తా బడ్డ లారీ సంఘటన సోమవారం మండలంలోని కొత్తపల్లి ఫ్లైఓవర్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు విజయవాడ నుండి బెంగళూరుకి కొరియర్ సర్వీస్ తరలిస్తున్న లారీ కొత్తపల్లి సమీపంలో వస్తుండగా అదుపుతప్పి పక్కనున్న సర్వీస్ రోడ్లోకి బోల్తా పడింది. ఈ సంఘటనలో కర్ణాటకకు చెందిన లారీ డ్రైవర్ మంజుకి స్వల్ప గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు టు టౌన్ పోలీస్ స్టేషన్లో సోమవారం మహిళ అదృశ్యం కేసు కేసు నమోదు అయింది. కృష్ణానగర్ గ్రీమ్స్‌పేట్ డోర్ నెంబర్ 4-2158/ బిలో నివాసం ఉంటున్న ఈ ఎమ్మెస్ బాబు సతీమణి కల్పన (45) గత నెల 30వ తేదీ నుండి ఎక్కడికి వెళ్లేది ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయింది. తిరిగి వస్తుందని వేచి చూసిన కుటుంబ సభ్యులు కల్పన తిరిగి రాకపోవడంతో సోమవారం చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిళా మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సిఐ అదుపులో వున్న నిందితులు

దొంగల గుట్టు రట్టు

- సిఐ అదుపులో నిందితులు
- భానుమతి గుజరి దుకాణం దొంగతనానికి తెర

బైరెడ్డిపల్లి- ప్రజాశక్తి: మండల కేంద్రంలోని భానుమతి గుజరి అంగడిలో ఇటీవల చోటు చేసుకున్న దొంగతనాన్ని నాలుగు రోజుల్లో ఛేదించిన బైరెడ్డిపల్లి పోలీసులు మరోసారి తమ నిపుణతను ప్రదర్శించారు. శుక్రవారం రాత్రి దొంగలు దుకాణంలోకి చొరబడి విలువైన వస్తువులను అపహరించగా, బాధితురాలు భానుమతి పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై స్పందించిన సీఐ పరశురాముడు, కేసు నమోదు చేసి తన సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. విచారణలో సోమవారం నాటికి తన్వీర్, సుహేల్, సుల్తాన్, ఇబ్రహీం అనే నలుగురు నిందితులు బాధ్యత వహించినట్లు గుర్తించారు. వారిలో ఒకరు కర్ణాటకకు చెందినవాడిగా గుర్తించి అరెస్ట్ చేశారు. వారు దొంగిలించిన సుమారు రూ.1.50 లక్షల విలువగల వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను సీఐ పరశురాముడు ప్రెస్‌మీట్ ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ పరశురాముడు. పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. నాలుగు రోజుల్లోనే న్యాయం చేసి, మా వస్తువులు రికవర్ చేసి ఇచ్చిన పోలీస్ శాఖకు కృతజ్ఞతలు అని బాధితురాలు భానుమతి హర్షం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న డిఎంహెచ్‌వో ఆఫీసు ఎఫ్‌బి నోడల్ ఆఫీసర్ అనిల్ కుమార్

వైద్య ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-సోమల: పెద్ద ఉప్పరపల్లి ,సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పనితీరు రికార్డులు చిత్తూరు డిఎంహెచ్‌వో ఆఫీసు ఎఫ్‌బి నోడల్ ఆఫీసర్ అనిల్ కుమార్ సోమవారం పరిశీలించారు. గర్భిణులు నమోదు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరుగుతున్నాయా? ఓపి స్టాక్ రిజిస్టర్ ఇతర సౌకర్యాలపై రికార్డులు పరిశీలించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షాలు పడుతున్న కారణంగా గ్రామాలలో జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని దీనిపై క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తి స్థాయిలో సర్వేలు నిర్వహించి వ్యాధి లక్షణాలు కనపడిన వెంటనే వైద్యం అందించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు బాలాజీ, జయసింహ, ఏఎన్‌ఎంలు సూపరువైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

ప్రజాశక్తి-కుప్పం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భావించాలని కుప్పం ఏఎంసి చైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం కుప్పంలో మొక్కలు నాటారు. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్న భావనను ప్రతి ఒక్కరిలో కల్పించడమే లక్ష్యంగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కార్యదర్శి పాల్గొన్నారు.

అలింకో డాక్టర్ల వైద్య శిబిరం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో ని ప్రాథమిక పాఠశాల సోమవారం అలింకో డాక్టర్ల చే దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. చిత్తూరు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో మెడికల్ అసెస్మెంట్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఏపీసి వెంకటరమణ పాల్గొన్నారు. అర్హులైన ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లలందరూ ప్రభుత్వం అందించే సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మెడికల్ క్యాంపుకి హాజరైన వారందరూ అలింకో డాక్టర్ల సహకారంతో వైద్య నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. ఈ క్యాంపులో 70మంది పిల్లలు 70 మంది పేరెంట్స్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జీడీ నెల్లూరు ఎంఈఓ లు ఆంజనేయులు శెట్టి, గుణశేఖర్ రెడ్డి, పెనుమూరు ఎంఈఓ భాస్కర్ నాయుడు, పాలసముద్రం మండల విద్యాశాఖ అధికారి గిరిజ , సహిత విద్య సమన్వయకర్త జగ్గు మధు, మండలాల స్పెషల్ ఎడ్యుకేటర్లు, ఐ ఈ ఆర్ పి ఎస్, భవిత సిబ్బంది పాల్గొన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులైన పిల్లలకు డాక్టర్లు వైద్య నిర్ధారణ చేశారు. పెనుమూరు మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమనాయుడు మాట్లాడుతూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అండగా ఉన్నాయన్నారు. విద్యార్థుల పట్ల వివక్షత లేకుండా ఆత్మస్థైర్యం నింపేలా ప్రవర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు స్వామిదాస్, యాదవ జిల్లా సాధికారిత శ్రీధర్ యాదవ్, హరీష్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం సందర్భంగా మాట్లాడుతున్న అధికారులు